క్లుప్తంగా

వెంకన్న ఆలయ నిర్మాణానికి రూ.1.11 లక్షల విరాళం



వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు తమ వంతు సహకారం అందిస్తున్నారు. రూ.5 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం మునగపాకకు చెందిన మొతికా సాంబశివరావు జ్ఞాపకార్థం ఆయన భార్య తులసి, కుమారులు సన్యాసిరావు, మల్లికార్జునరావు రూ.1,11,111 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, ఆడారి అచ్చియ్యనాయుడు, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు బేసిన్లు అందిస్తున్న తిమ్మరాజుపేట పాల సంఘం అధ్యక్షుడు జగన్నాథరావు

మునగపాక: విశాఖ డెయిరీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట పాల సంఘం అధ్యక్షుడు శరగడం జగన్నాథరావు కోరారు. మండలంలోని తిమ్మరాపుపేట పాల సొసైటీ పరిధిలోని రైతులకు ఆదివారం ఆయన పశుదాణాకు సంబంధించిన బేసిన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు భీశెట్టి లక్ష్మణరావు, రైతులు పాల్గొన్నారు.

64 మందికి నేత్ర వైద్య పరీక్షలు



రోగులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

మునగపాక: తిమ్మరాజుపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనకాపల్లికి చెందిన నటరాజ్ ఆప్టికల్స్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 64 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో అవసరమైన వారికి శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు చేస్తామని తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ జగన్ తెలిపారు.

తుప్పలతో ఆందోళన



మునగపాక బీసీ కాలనీలో పెరిగిపోయిన తుప్పలు

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక బీసీ కాలనీలో తుప్పలు పేరుకుపోతున్నాయి. కాలనీని ఆనుకొని ప్రభుత్వ పాఠశాల కూడా ఉంది. నిత్యం ఈ కాలనీ మీదుగా విద్యార్థులతో పాటు గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలంలో తుప్పలు పెరిగిపోయాయి. దీంతో పాముల సంచారం ఎక్కువగా ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తుప్పల తొలగింపుపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఘనంగా శివాలయం వార్షికోత్సవం



ఎం.అలమండ శివాలయంలో హోమం చేస్తున్న భక్తులు

దేవరాపల్లి: ఎం.అలమండలో శివాలయం 20వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ నియమ నిష్టలతో హోమం జరిగింది. స్వామి వారికి 101 కలశాలతో భక్తులు అభిషేకాలు చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీగా అన్న సమారాధన జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

రైల్వే గేటు దాటని కష్టాలు..!

- పెరిగిన రైళ్ల రాకపోకలు
- తరచూ పడుతున్న గేట్లు
- గంటల తరబడి వాహనదారుల నిరీక్షణ
- అత్యవసర సమయంలో తప్పని ఇబ్బందులు
- ప్రతిపాదనల దశ దాటని ఆర్‌యూబీల నిర్మాణం



ఏటికొప్పాక రైల్వే గేటు



రాంనగర్ రైల్వే గేటు వద్ద వాహన చోదకుల నిరీక్షణ

యలమంచిలి రూరల్: రైలు గేటు పడిందా.. అంతే సంగతి. పెరిగిన రైళ్ల రాకపోకలతో ప్రతి అర గంటకు ఒకటి, రెండు సార్లు రైల్వే గేట్లు పడిపోతున్నాయి. రైలు వచ్చే ముందు ఒక పావుగంట, రైలు గేటు దాటి వెళ్లి.. సిగ్నల్ దాటే వరకు మరో 10 నిమిషాలు, ఈలోగా పక్క రైల్వే మార్గంలో మరొక రైలు వస్తే మరొక 20 నిమిషాలు.. ఇలా ఒక్కోసారి మూడు రైళ్లు వెళ్లే వరకు సుమారు అర్ధ గంట నుంచి 40 నిమిషాల వరకు రైల్వే గేట్ల వద్ద ఇరువైపులా వాహనదారులు బారులు తీసి నిరీక్షించాల్సిందే. యలమంచిలి పట్టణంలోని రాంనగర్, మండలంలోని ఏటికొప్పాక రైల్వే గేట్లు వాహనదారులు, స్థానికులకు నిత్యం నరకం చూపిస్తున్నాయి. రాంనగర్ రైల్వే గేటు వద్ద వాహనాల రద్దీ గత ఐదేళ్లలో గణనీయంగా పెరిగింది. ఈ రైల్వే మార్గం మీదుగా ప్రయాణించే రైళ్ల సంఖ్య కూడా పెరిగింది. దీంతో ప్రయాణికుల కష్టాలు కూడా పెరిగాయి. ఈ రైల్వే గేటు మీదుగా రాంనగర్, పెదపల్లి, టిడ్కో గృహ సముదాయం, అల్లూరి సీతారామరాజు కాలనీ, పాత ఎర్రవరం, శేషుకొండ కాలనీ, జగనన్న కాలనీ, గొల్లలపాలెం, మంత్రిపాలెం, యలమంచిలి పట్టణానికి చెందిన వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోజుకు 100కి పైగా వివిధ రైళ్లు కూడా ప్రయాణిస్తున్నాయి. ఇంత రద్దీగా ఉండే ఈ లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం చాలా అవసరం.

మండలంలోని పద్మనాభరాజు పేట దాటిన తర్వాత ఏటికొప్పాక వెళ్లే మార్గంలో రైల్వే గేటుతో పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వైద్యం అవసరమైనప్పుడు, ఇతర అత్యవసర సమయాల్లో ఏటికొప్పాక, బయ్యవరం, పద్మనాభరాజు పేట, దార్లపూడి, పులపర్తి సహా పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర అత్యవసర పనులతో ప్రయాణించే వారికి ఈ రైల్వే గేట్లతో నిత్యం నరకం అనుభవిస్తున్నారు.

రైల్వే గేట్ల వద్ద ప్రజల కష్టాల దృష్ట్యా ఆర్‌యూబీ(అండర్ పాస్)ల నిర్మాణం ఆవశ్యకత ఎంతైనా ఉంది. గతంలో మండలంలోని తురంగలపాలెం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న రైల్వేగేటు వద్ద అండర్ పాస్ నిర్మించారు. దీనికంటే రాంనగర్, ఏటికొప్పాక రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. అయినా ఈ రైల్వే గేట్ల వద్ద కాకుండా రద్దీ తక్కువగా ఉండే తురంగలపాలెం గేటు వద్ద అండర్ పాస్ నిర్మించారు. అత్యంత రద్దీగా ఉండే రాంనగర్ రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణం ప్రతిపాదనల దశ దాటలేదు. ఇక్కడ అండర్ పాస్ నిర్మాణం త్వరలోనే పూర్తవుతున్నట్టు కూటమి నాయకులు 8 నెలల క్రితం హడావుడి చేశారు. రాంనగర్ రైల్వే గేటు కష్టాలు తీరిపోయినట్టు ప్రచారం కూడా చేసుకున్నారు. ఇది జరిగి సుమారు 9 నెలలు గడుస్తున్నా దీనికి సంబంధించిన దస్త్రాల్లో కదలిక లేదు. రాంనగర్, ఏటికొప్పాక రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టి, ప్రజల కష్టాలు తీర్చాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది.

అరగంట ఆగాల్సిందే..



మా గ్రామానికి వచ్చే మార్గంలో ఉన్న రైల్వే గేటు మూస్తే అర గంట వరకు అక్కడ వాహనాలు ఆగాల్సిందే. రైలు గేటు దాటినా ఇంటర్నల్ లాక్ సిస్టమ్‌తో రైలు బోగీలు సిగ్నల్ దాటే వరకు ఎదురు చూడాల్సిందే. రైల్వే గేటు 20 నుంచి 40 నిమిషాల వరకు మూసివేస్తున్నారు. వివిధ పనులపై యలమంచిలి, 16వ నెంబరు జాతీయ రహదారికి, నర్సీపట్నం, కోటవురట్ల వంటి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు రైల్వేగేటు పడిందంటే ఇబ్బందులతో పాటు నష్టం తప్పడం లేదు.

– శ్రీశైలపు చిన్నయాచారి, హస్త కళాకారుడు, ఏటికొప్పాక

ఆర్‌యూబీ పనులు ప్రారంభించాలి



రాంనగర్ రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీ పనులు వెంటనే ప్రారంభించాలి. యలమంచిలి పట్టణాన్ని రెండు ముక్కలుగా విడగొట్టిన ఈ రైల్వే గేటు తరచూ పడుతోంది. గతంలో ఇక్కడ అండర్ పాస్ నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి.

– రమణ, యలమంచిలి

కార్మికుల తరలింపులో నిర్లక్ష్యం!



వాహనంలో పరిమితికి మించి ఓ పరిశ్రమకు కార్మికులను తీసుకెళ్తున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్ : స్థానిక పరిశ్రమల్లో పని చేయడం కోసం కార్మికులను తరలించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్మికులను ఒకే వాహనంలో పరిమితికి మించి ఎక్కించి పరిశ్రమలకు తరలిస్తున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే ఎన్నో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పొట్టకూటి కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వలస కార్మికులు అతి తక్కువ వేతనాలకు స్థానిక పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తూ మగ్గిపోతున్నారు. కనీసం కార్మికులకు భద్రత లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



పెద్దల సమక్షంలో ఫాదర్స్ డే కేక్ కట్ చేస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. ఫాదర్స్ డే సందర్భంగా ఆదివారం మునగపాక దళితవాడలో ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబాన్ని నడిపించే తండ్రి పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దిమ్మల నూకరాజు, కరణం గణేష్, బీలా అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మంగవరంలో ఉచిత వైద్య శిబిరం



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న మమతా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు

పాయకరావుపేట: మంగవరం గ్రామంలో మహిళల కోసం ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మమతా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగవరానికి చెందిన దివంగత గణసాల రామన్నదొర జ్ఞాపకార్థం ఆయన కుమారులు నూకరాజు, వెంకటేశ్వరరావు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో 50 మంది మహిళలకు గైనకాలజిస్ట్ గర్భాశయ, రొమ్ము పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి ప్రతినిధులు కట్టా వీరబాబు, నీలాపు వెంకటరెడ్డి, ఎంపీటీసీ గూటూరు విజయలక్ష్మి రామగోవిందు, కోనే పుత్రరావు, మాజీ సర్పంచ్ దేవవరపు ఆనంద్ కుమార్, కోనే కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

శిథిల స్థితికి మునగపాక బ్రిడ్జి



పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి అడుగు భాగం

మునగపాక: మునగపాక గ్రామంలోకి వచ్చే బ్రిడ్జి అడుగు భాగం శిథిలావస్థకు చేరింది. పూడిమడక రోడ్డు మునగపాక జంక్షన్ నుంచి గ్రామంలోకి వచ్చేందుకు గతంలో బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే బ్రిడ్జి అడుగుభాగం పెచ్చులూడిపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అవుట్ సోర్సింగ్ వర్కర్లకు 'తల్లికి వందనం' ఇవ్వాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొరబాబు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజాన దొరబాబు

అనకాపల్లి: తల్లికి వందనం అంగన్‌వాడీ, హాస్టల్ అవుట్ సోర్సింగ్ వర్కర్లకు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక కొడుగంటి గోవిందరావు భవనంలో ఏఐటీయూసీ జిల్లా సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు, వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరికి తల్లికి వందనం పథకాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనాల వల్ల కుటుంబ పోషణ, పిల్లల చదువులు చాలా కష్టతరంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.త్రినాథ్, జిల్లా నాయకులు విత్తనాల పోతురాజు, సత్యనారాయణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో కూటమిలో చీలికలు

- టీడీపీ నాయకులకు జనసేన గేలం
- మండిపడుతున్న టీడీపీ వర్గాలు
- స్థానిక ఎన్నికల్లో కలసి పనిచేసేది లేదని స్పష్టం

గొలుగొండ : లింగంపేటలో కూటమిలో వర్గపోరు పురుడుపోసుకుంది. వచ్చే స్థానిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని జనసేన, టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయి పనిచేస్తున్నాయి. లింగంపేట గ్రామ పంచాయతీ చరిత్రలో గడిచిన 20 సంవత్సరాల్లో సీపీఐ, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ నేతలు మాత్రమే ఇప్పటి వరకు గెలుపొందడం జరుగుతుంది. పలుసార్లు అయ్యన్న ఈ గ్రామంలో పర్యటించిన సందర్భంలో ఇక్కడ టీడీపీకి కనీస బలం లేకపోవడం ఇక్కడ నాయకులు ఎలా పనిచేస్తున్నారో అర్థం అవుతుందని అసహనం వ్యక్తం చేసిన సందర్భాలు అనేకం. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి వర్గపోరుతో కొట్టుకుంటున్నది. కూటమిలోని జనసేన నాయకులు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ఇటీవల జనసేనలో సలాదులు ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేర్పులు చేశారు.

ఇందులో 15 మందికి జనసేన కండువాలు కప్పడం జరిగింది. కానీ వీరంతా ఎక్కువ శాతం టీడీపీ వాళ్లే. ఇది జరిగినప్పటి నుంచి లింగంపేటలో రాజకీయం వేడెక్కింది. వచ్చే స్థానిక ఎన్నికల్లో జనసేనకు అవకాశం లేకుండా టీడీపీ అభ్యర్థిని నిలబెట్టాలని ఆలోచిస్తుంది. దీంతో బలం తక్కువగా ఉన్న జనసేన టీడీపీ కంటే బలపడి టీడీపీకి అవకాశం లేకుండా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. కూటమి పొత్తు ధర్మం తప్పి టీడీపీ నాయకులను జనసేనలో చేర్చారని ఆ పార్టీ నాయకులు జనసేనపై మండిపడుతున్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కలసి పనిచేయలేమని రెండు పార్టీ నేతలు తేల్చి చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ సుమారుగా 1250 పైచిలుకు ఓట్లు ఉన్నాయి. ఇక్కడ కంచుకోటలా ఉన్న వైఎస్సార్‌సీపీ మళ్లీ వచ్చే స్థానిక ఎన్నికల్లో జెండా ఎగురవేయడం కోసం కలసికట్టుగా పనిచేస్తున్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగా ర్యాలీలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

అనకాపల్లి టౌన్: ఆరోగ్యంగా జీవించాలంటే యోగా ఒక్కటే సరైన మార్గమని పతంజలి యోగా సమితి, భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు దొరమ్మనాయుడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని జార్జ్ క్లబ్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్‌లో మెయిన్ రోడ్డు మీదుగా యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చక్కటి ఆలోచన శక్తి పెంపొందిస్తుందన్నారు. అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తుందన్నారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు ఈ నెల 21న యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు బి. మంగయ్య, బి. నరసింగరావు, మాదేటి జనార్దన్, జార్జ్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు, కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వనాథ్, కాండ్రేగుల చిన్న తదితరులు పాల్గొన్నారు.

రహదారులా.. చెరువులా!



ఎస్.రాయవరం రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



అధ్వానంగా గుర్రాజుపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు



కొరుప్రోలులో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని ఉన్న పంచాయతీ రోడ్డు దుస్థితి



పెనుగొల్లు పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో వర్షపు నీరు

ఎస్.రాయవరం: వర్షం పడితే మండలంలోని పలు గ్రామాల రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రహదారులను ఇరువైపులా ఉన్న కాలువలు, గట్లను ఆక్రమించి పూర్తిగా కప్పివేయడంతో వర్షం పడినప్పుడు ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. మండల కేంద్రం ఎస్.రాయవరం రోడ్డు లింగరాజుపాలెం వెళ్లే వైపు, అడ్డు రోడ్డు-రేవుపోలవరం రోడ్డు, గుర్రాజుపేట తారు రోడ్డు, పి.ధర్మవరం-ఎస్.రాయవరం రోడ్డు, పెనుగొల్లు పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు, కొరుప్రోలు వైఎస్సార్, జగనన్న కాలనీ, దళిత కాలనీకి వెళ్లే రోడ్డు, రేవుపోలవరం రోడ్డు, సైతారుపేట జంక్షన్ సమీపంలో సర్వసిద్ధిరోడ్డులో ఆక్రమణలు పెరిగిపోయాయి. దీంతో ఏమాత్రం వర్షం కురిసినా రోడ్లు చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధాశ్రమాన్ని అడిషనల్ సివిల్ జడ్జి సందర్శన



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి రమేష్

అనకాపల్లి: మండలంలో వెంకుపాలెం హృదయాలయ వృద్ధాశ్రమాన్ని మొదటి అడిషనల్ సివిల్ జడ్జి ఎ.రమేష్ ఆదివారం సందర్శించా రు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పదో అదనపు న్యాయమూర్తి వి.నరేష్ ఆదేశాలు మేరకు ఇక్కడ ఆశ్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులు ఐకమత్యంగా ఉండి వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాకలో జరుగుతున్న పారిశుద్ధ్యం పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కోరారు.

రేషన్ సరకుల కోసం అవస్థలు

అచ్యుతాపురం రూరల్ : మండలంలో హరిపాలెం గ్రామ పరిధిలో పలువురు లబ్ధిదారులకు ఇప్పటికీ రేషన్ సరకులు అందలేదు. స్థానికేతరులకు ఇచ్చేశామంటూ డిపో డీలర్ చెబుతుండడంతో మండిపడుతున్నారు. కొందరిని కొండకర్ల వెళ్లి తెచ్చుకోవాలని సూచించగా.. తప్పనిసరి పరిస్థితిలో పలువురు తెచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి 50 ఇళ్లకు ఒక చోట వాహనంతో రేషన్ సరకులు అందించేవారు. రేషన్ పంపిణీ సమాచారాన్ని ముందుగా తెలియజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎవరికి ఎప్పుడు రేషన్ అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రోజూ డిపో వద్ద క్యూ కట్టి వేచి ఉన్నా సర్వర్ సరిగా పనిచేయడం లేదంటూ తిరిగి పంపించేస్తున్న పరిస్థితులు తరచూ లబ్ధిదారులకు ఎదురవుతున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని ఎందరో నిరుపేద లబ్ధిదారులు ఒక్కోసారి తమ పనులు మానుకుని రేషన్ కోసం గంటల కొద్దీ క్యూలో వేచి ఉండి నిరాశతో తిరుగుముఖం పట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీలర్లు ఎటువంటి సాకులు చెప్పకుండా లబ్ధిదారులకు రేషన్ అందించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

500 ఘటాలతో మోదకొండమ్మ వీధి పండగలు



మోదకొండమ్మ ఘటాలు శిరస్సున పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళుతున్న భక్తులు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ వీధి పండగలు వందలాది మంది భక్తులు ఆదివారం నిర్వహించారు. సుమారు 500 మంది భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని డప్పులు, వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఆలయానికి కాలినడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. మాడుగుల గవర వీధికి చెందిన పెంటకోట కొండబాబు, లక్ష్మి కుటుంబ సభ్యులు 101 ఘటాలు, అర్బన్ కాలనీకి చెందిన పోతక కళ్యాణం కుమారులు ఈశ్వరరావు, జగ్గారావు, కుటుంబ సభ్యులు 101 ఘటాలతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన మరో 300 మంది భక్తులు ఘటాలు శిరస్సున పెట్టుకుని పండగ చేశారు. ఈ పండగలో నూతనంగా ఎన్నుకోబడిన 16 మంది కమిటీ సభ్యులు సేవలందించారు.

టైప్-4 కేజీబీవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కె.కోటపాడు : కె.కోటపాడు హైస్కూల్‌లో గల టైప్-4 కేజీబీవీలో చేరేందుకు ఆసక్తి గల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవోలు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. 9, 10, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో చేరు విద్యార్థులు ఈ నెల 30లోగా అడ్మిషన్లు పొందాలన్నారు. టైప్-4 కేజీబీవీలో హాస్టల్ సదుపాయం ఉందని, కుల, ఏడాదికి రూ.1.44 లక్షలలోపు ఆదాయం ఉన్నవారు కె.కోటపాడు హైస్కూల్ హెచ్‌ఎంకు దరఖాస్తు అందించాలని సూచించారు.

వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె. మురళీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెలాఖరులోపు ప్రవేశాలు పొందవచ్చునన్నారు. కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం ఏటా జాబ్ మేళాలు నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. వృత్తి విద్యా కోర్సులు ఎంఈటి, రెండేళ్ల కోర్సు, పాలిటెక్నిక్‌లో రెండో ఏడాది ప్రవేశాలు పొందవచ్చునన్నారు. దీంట్లో చేరేందుకు ఐదు శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. అలాగే ఈఈటీ కోర్సు ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన కోర్సు. దీంతో పాటు సిఈటీ కోర్సు సివిల్ ఇంజినీరింగ్ చేయాలనుకునే వారికి పునాదిగా ఉపకరిస్తుందన్నారు. దీంతో పాటు ఎంపిహెచ్‌డబ్ల్యూ(యఫ్) కోర్సు చేసిన బాలికలకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.